క్లుప్తంగా

పేదల కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జగనన్న



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అంటే రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనమని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. వై.ఎస్.జగన్ జన్మదినోత్సవం పురస్కరించుకుని ముందస్తుగా సేవా కార్యక్రమాల్లో భాగంగా నియోజకవర్గ పరిధిలోని పాతబస్టాండ్ సెంటర్, హిమని సెంటర్, రాజీవ్‌గృహకల్ప రోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోడ్లపై పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆశయాల నెరవేర్చేందుకు జగనన్న అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. 2029 ఎన్నికల్లో భారీ మెజార్టీతో వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

స్పష్టమైన ఆర్థిక నివేదికలతోనే సంస్థ అభివృద్ధి



ఏఎన్‌యూ: స్పష్టమైన ఆర్థిక నివేదికలతోనే సంస్థ అభివృద్ధి చెందుతుందని వీసీ ఆచార్య కె. గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, అసోసియేషన్ ఆఫ్ సర్టిఫైడ్ చార్టెడ్ అకౌంటెన్సీ(ఏసీసీఏ) సంయుక్తంగా శనివారం 'ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్' అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ప్రసంగిస్తూ ఆర్థిక నివేదికలు, ఆదాయ వ్యయాలను అంచనా వేసుకొని మార్కెట్‌కు అనుగుణంగా మార్పులు చేర్పులు, అంచనాలు వేసినప్పుడే ఆయా సంస్థల మనుగడ సాధ్యమవుతుందని తెలిపారు. యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం. సురేష్ కుమార్ మాట్లాడుతూ అధ్యాపకుల జ్ఞానాభివృద్ధి కార్యక్రమాలు ఎప్పటికప్పుడు తాజా సమాచారంతో ఉండటం గొప్ప విషయమని తెలిపారు. ముంబైకి చెందిన ఏసీసీఏ ప్రతినిధి జహీర్ సయ్యద్ మాట్లాడుతూ వ్యాపార సంస్థల ఆర్థిక నివేదికల సమర్పణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధానాలను వివరించారు. కార్యక్రమంలో చెన్నైకు చెందిన అసోసియేషన్ ఆఫ్ సర్టిఫైడ్ చార్టెడ్ అకౌంటెన్సీ ప్రతినిధి రాయిస్టన్ ఎబినేజర్, కామర్స్ విభాగాధిపతి ఆచార్య ఆర్. శివరాం ప్రసాద్, పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్గో డోర్ డెలివరీపై అవగాహన



పట్నంబజారు: ప్రయాణికులు, ప్రజలకు ఉపయోగపడేలా కార్గో డోర్ డెలివరీ సౌకర్యాన్ని సమర్థంగా ముందుకు తీసుకెళ్లాలని ఏపీఎస్‌ఆర్టీసీ ఆర్ఎం ఎం.రవికాంత్ చెప్పారు. కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రయాణికుల వద్దకు నేరుగా వెళ్లి డోర్ డెలివరీ సౌకర్యం గురించి వివరించారు. అనంతరం డోర్ డెలివరీ సౌకర్యానికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఆర్ఎం ఓ రవికాంత్ మాట్లాడుతూ కార్గో డోర్ డెలివరి మాసోత్సవాలకు సంబంధించి చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా అధికారులు, సిబ్బంది ముందుకు సాగాలని తెలిపారు. ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేసేలా కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. కార్గో సర్వీస్ మరింత బలోపేతం అయ్యే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. డోర్ డెలివరీ సౌకర్యం ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు-1,2 డిపో మేనేజర్లు ఎం.రామకృష్ణ, షేక్ అబ్దుల్ సలాం, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై గరం.. గరం



వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ కార్పొరేటర్లు



అంబేద్కర్ చిత్రపటంతో నిరసన తెలుపుతున్న వార్డు డివిజన్ కార్పొరేటర్

- నెలన్నర రోజుల్లో రెండుసార్లు నిలిపివేతపై ప్రశ్నల వర్షం
- అనధికార ట్యాప్ కనెక్షన్‌లపై చర్చ
- సుదీర్ఘంగా సాగిన కౌన్సిల్ సమావేశం
- 28వ తేదీకి కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేసిన మేయర్ కావటి



మాట్లాడుతున్న మేయర్ కావటి మనోహర్ నాయుడు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు శుక్రవారం అధ్యక్షతన జరిగింది. ఉదయం 10.40 గంటలకు కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. మొత్తం 361 అంశాలలో సభ్యుల ప్రశ్నలు 99 కాగా..మిగిలినవి సభ్యుల ప్రతిపాదనలు, ప్రియాంబుల్స్ ఉన్నాయి. గుంటూరు నగరానికి పక్కనే కృష్ణా నది ఉన్నప్పటికీ ప్రజలకు తాగునీటిని అందించలేకపోతున్నారని, లీకుల పేరుతో నెలన్నర రోజుల్లో రెండు సార్లు అంతరాయం ఏర్పడిందని కౌన్సిల్‌లో ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఇతర సభ్యులు అధికారులను నిలదీశారు. శుక్రవారం సాయంత్రం వరకు 25 ప్రశ్నలకు మాత్రమే చర్చ జరిగింది. మిగిలిన వాటిపై చర్చించేందుకు ఈ నెల 28వ తేదీకి కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేశారు.

కరెంట్ సాకుగా చూపడం సిగ్గుచేటు

విజయవాడ నుంచి తాగునీటిని తక్కెళ్లపాడు తీసుకువచ్చే క్రమంలో ఎక్కడైనా కరెంట్ పోతే గుంటూరు నగరంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అడిగిన ప్రశ్నకు అధికారులు చెప్పిన సమాధానంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది సరైన సమాధానం కాదని... ఫేక్ సమాధానాలు ఎందుకు ఇస్తారంటూ ? అధికారులను నిలదీశారు. నగరంలో అనధికార ట్యాపులు అధికంగా ఉన్నాయని, కొన్ని ప్రాంతాల్లో తాగునీరు నిరంతరం వస్తోందని సభ్యులు ధ్వజమెత్తారు. మరికొన్ని ప్రాంతాల్లో అరగంట మాత్రమే వస్తుందని, అర్ధరాత్రులు నీరు వదులుతున్నారని తెలిపారు. వాటర్ సోర్స్ ఉన్నప్పటికీ రెండు గంటలు కూడా నీటిని ఇవ్వకపోవడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ సిటీలో అనధికార ట్యాపులు ఉన్నాయని, కేవీపీ కాలనీలో 165 అనధికార ట్యాపులను తొలగించామని తెలిపారు. గుంటూరు నగరానికి విజయవాడ నుంచి 142 ఎంఎల్‌డీ వాటర్ వస్తుందని, ఆ నీరంతా ఎటు పోతుందో అర్థంకావడం లేదన్నారు. దీన్ని స్ట్రీమ్ లైన్ చేసి తాగునీటి సరఫరాను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తామని తెలిపారు. నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి టూ టౌన్‌కి ప్రత్యేకంగా పైపులైన్ వేశారని, నెహ్రూనగర్ రైల్వే గేటు వద్ద ఇంటర్ కనెక్షన్ ఎందుకు ఇవ్వలేదని ఎమ్మెల్యే మాధవి ప్రశ్నించారు. దీనికి స్థానికుల నుంచి కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, వాటిని ప్రజాప్రతినిధులతో కలిసి పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు. గోరంట్ల వాటర్ ట్యాంక్ నిర్మాణం ఇంకా ఎంత కాలం సాగదీస్తారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రశ్నకు జనవరి నాటికి పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని కమిషనర్ చెప్పారు.

45 రోజులకొకసారి కౌన్సిల్ పెట్టాలి : మేయర్ కావటి

గత కౌన్సిల్ సమావేశంలో నెల రోజులకొకసారి కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని సభ్యులందరూ తీర్మానించినప్పటికి నాలుగు నెలలు గడిచిన తరువాత పెట్టడంపై కార్పొరేటర్లు అచ్చాల వెంకటరెడ్డి, ఈచంపాటి వెంకటకృష్ణ, షేక్ రోషన్, ఇతర కౌన్సిల్ సభ్యులు అధికారులను నిలదీశారు. 45 రోజులకొకసారి కౌన్సిల్ నిర్వహించాలని తీర్మానించినప్పటికీ ఎందుకు పెట్టలేదని మేయర్ కావటి మనోహర్‌నాయుడు ప్రశ్నించారు. వరదల కారణంగా ప్రత్యేక కౌన్సిల్ సమావేశం పెట్టి చర్చించాలని డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు లేఖ రాసినప్పటికి అధికారులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఇక నుంచి నెల రోజులు కాగానే సభ్యులు ప్రశ్నలు, ప్రతిపాదనలు సెక్రటరీకి అందజేస్తే 15 రోజుల్లో అధికారులు దీనికి సంబంధించి సమాధానాలు తయారు చేసుకుని కౌన్సిల్ నిర్వహించాలని ఆదేశించారు.

ఇంజినీరింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేస్తాం: కమిషనర్

ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ట్యాప్ వర్కర్లు, ఇతర సిబ్బందికి అంతర్గత బదిలీ నిర్వహించి, అవినీతికి తావులేకుండా చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలియజేశారు. ఖాళీ స్థలాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని దీనికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మాధవి ప్రశ్నకు అధికారులు ఇచ్చిన సమాధానంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు.

కౌన్సిల్‌కు క్యారేజీలు తెచ్చుకుంటాం

సభ్యులకు భోజనాలు ఏర్పాటు చేసే ప్రక్రియలో అధికారులు విఫలం చెందారు. కనీసం అన్నం పెట్టడం లేదని, ప్లేట్లు లేవని, మహిళల వెయింటింగ్ రూమ్ అధ్వానంగా ఉందని కార్పొరేటర్ కనకదుర్గ అధికారులను నిలదీశారు. మరో కార్పొరేటర్ మర్రి అంజలి మాట్లాడుతూ సభ్యులకు భోజనాలే సక్రమంగా పెట్టకపోతే ఎలా... ఈసారి నుంచి కౌన్సిల్‌కు ఇంటి నుంచే క్యారేజీలు తెచ్చుకుంటామని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు అన్నం లేకపోవడంతో వారు ఏడ్చుకుంటూ వెళ్లిపోయారు.

కూటమి నేతల ఓవర్ యాక్షన్

కౌన్సిల్ సమావేశంలో ప్రొటోకాల్ పాటించకపోవడంపై వైఎస్సార్‌సీపీ సభ్యులు కొ అధికారులును ప్రశ్నిస్తున్న క్రమంలో టీడీపీ శ్రేణులు ఓవర్ యాక్షన్ చేశారు. ఒకానొక సందర్భంలో టీడీపీ కార్పొరేటర్ నూకవరపు బాలాజీ అతిగా మాట్లాడారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లకు మానసిక స్థితి బాగోలేదేమో ఆసుపత్రిలో చూపించుకోండని వెటకారంగా మాట్లాడటంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు మండిపడ్డాయి.మేయర్ కావటి వాఖ్యలను రికార్డ్స్ నుంచి తొలగించాలని ఆదేశించారు.

అమిత్‌షా వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

కేంద్ర మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కార్పొరేటర్ పాపతోటి అంబేడ్కర్, ఇతర సభ్యులు అంబేడ్కర్ ఫోటోతో నిరసన తెలియజేశారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు అయిన తామంతా అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ద్వారానే ఎన్నికయ్యామని.. ఆయనపై అమిత్‌షా వ్యాఖ్యలు సిగ్గుచేటని ఖండించారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



పట్నంబజారు: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గుంటూరు నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్ చెప్పారు. హిందూ కళాశాల కూడలి సమీపంలోని మున్సిపల్ ట్రావెల్ బంగ్లా సమీపంలో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా తిరుగుతున్న ద్విచక్రవాహనాదారులకు వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్యతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని తెలిపారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణాపాయస్థితి నుంచి బయట పడవచ్చని చెప్పారు. ఎక్కువ మంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదంలో తలకు తీవ్రగాయాలై మృతి చెందారని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలకనుగుణంగా ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో సీట్ బెల్టు పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

గ్రేడ్ -1 నర్సింగ్ ట్యూటర్‌గా సుజాత



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ఆవరణంలోని ప్రభుత్వ నర్సింగ్ స్కూల్‌లో గ్రేడ్-2 నర్సింగ్ ట్యూటర్‌గా, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న కోటా సుజాతకు గ్రేడ్-1 ట్యూటర్‌గా ప్రమోషన్ లభించింది. శుక్రవారం గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ సుచిత్ర కౌన్సెలింగ్ నిర్వహించి ప్రమోషన్ ఇచ్చారు. సుజాత 1993లో స్టాఫ్ నర్సుగా ప్రభుత్వ సర్వీసులో చేరారు 2013లో గ్రేడ్-2 ట్యూటర్‌గా ప్రమోషన్ పొంది, గుంటూరు జీజీహెచ్ నర్సింగ్ పాఠశాలకు వచ్చారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్ షేక్ నాగూల్ షరీఫ్, సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావు పాల్గొన్నారు. ప్రమోషన్ పొందిన సుజాతకు పలువురు నర్సింగ్ స్కూల్, జీజీహెచ్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

అమిత్‌షా ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

ఏఎన్‌యూ: అంబేడ్కర్‌ను అవమానిస్తూ వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని యూనివర్సిటీ సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు డిమాండ్ చేశారు. ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని కోరుతూ శుక్రవారం యూనివర్సిటీలో నిరసన ప్రదర్శన చేశారు. అమిత్ షాకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంబేడ్కర్ ప్లకార్డులు చేతబట్టుకుని నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు అబ్రహాం లింకన్, మధుబాబు, రాజశేఖర్, రత్నకిషోర్, డీఈ కే సుబ్బారావు, వికాస నాయకులు డి. విజయప్రకాష్‌బాబు, పి. నాగరాజు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

నెహ్రూనగర్: అంబేడ్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యాలు చేసిన అమిత్ షా దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యాలను నిరసిస్తూ లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దళిత, ప్రజా సంఘాల నాయకులు పాగళ్ల ప్రకాష్, నల్లపు నీలాంబరం, సాదు మల్యాద్రి, జయసుధ పాల్గొన్నారు.



యూనివర్సిటీలో నిరసన ప్రదర్శన చేస్తున్న సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు

రేపు వినికిడి సమస్య వారికి ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: ఏబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వినికిడి సమస్య ఉన్న పిల్లలకు స్థానిక గుంటూరువారితోట 3వ లైనులోని రాధిక రాయుడు హాస్పటల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు సెక్రటరీ డాక్టర్ యార్లగడ్డ సుబ్బరాయుడు తెలిపారు. మూడేళ్లలోపు చిన్నారులకు రెండు చెవులకు ఉచితంగా రూ. 12 లక్షల ఖరీదు చేసే కాక్లియర్ ఆపరేషన్లు, మూడు నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు రూ. 25 లక్షల ఖరీదు చేసే కాక్లియర్ ఆపరేషన్లు ఉచితంగా చేస్తామని పేర్కొన్నారు. పిల్లల్లో వినికిడి లోపాలను ప్రాథమిక దశలో గుర్తించి ఆపరేషన్ చేయడం ద్వారా నివారించవచ్చని తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

జగనన్న పుట్టినరోజు అందరికీ పండుగ రోజు



విద్యార్థులకు పుస్తకాలు పండ్లు పంపిణీ చేస్తున్న డైమండ్‌బాబు, నూరిఫాతిమా

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలో పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ మాజీ యువజన విభాగం నగర అధ్యక్షుడు ఎలికా శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో మల్లికార్జునపేటలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో ముందస్తు జన్మదిన వేడుకలు నిర్వహించారు. పార్టీ నగర అధ్యక్షుడు, డెప్యూటీ మేయర్, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు), తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేడుకల్లో కేక్ కట్ చేసి విద్యార్థులకు పండ్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డైమండ్‌బాబు ఆమట్లాడుతూ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ జగనన్న పుట్టిన రోజు అంటే వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలకు పండుగ రోజు అని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

క్రీస్తు పుట్టుకతో సర్వ మానవాళికి సంతోషాలు



డాక్టర్ శనక్కాయల రాజకుమారి, డాక్టర్ ఉమాశంకర్‌లకు సత్కారం



వేడుకల్లో డాక్టర్ పృథ్వీ, వైద్యులు, సిబ్బంది తదితరులు

గుంటూరు మెడికల్: క్రీస్తు పుట్టుక సర్వ మానవాళికి సంతోషాలు తీసుకొచ్చిందని బీజేపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ అన్నారు. స్థానిక బొంగరాలబీడు క్రైస్ట్ ఇన్‌ఫ్యాక్ట్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మరో ముఖ్య అతిథి, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అందరూ ఆచరించాలని తెలిపారు. అహల్య ట్రస్టు డైరెక్టర్ డాక్టర్ శనక్కాయల రాజకుమారి మాట్లాడుతూ క్రీస్తు చూపిన ప్రేమ, కరుణ, జాలి, దయాగుణాలు ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, డాక్టర్ రాజకుమారి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, గోళ్ల ప్రభాకర్, కిషోర్, సింహాద్రి పాల్గొన్నారు.

ఆధునిక హాస్పిటల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

గుంటూరు మెడికల్: సర్వ మానవాళికి శాంతి, సమాధానాన్ని బోధించిన ఏసుక్రీస్తు చూపిన బాటను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆధునిక మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ పార్టనర్లు కడియాల శిల్ప సింధూర, డాక్టర్ వీర్నాల ప్రత్యూష్ అన్నారు. స్థానిక కొత్తపేట శివాలయం సమీపంలోని హాస్పిటల్‌లో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ పంచగాని యోహాన్ మాట్లాడుతూ ప్రేమ, సేవ, కరుణ అనే నినాదాలను పరమావధిగా చేసుకుని ఏసుక్రీస్తు మానవాళికి చేసిన సేవలు వెలకట్టలేనివని తెలిపారు. న్నారు. వేడుకల్లో డాక్టర్ పృథ్వి, డాక్టర్ హారిక తదితరులు పాల్గొన్నారు.

23న జిల్లా కేంద్రాల్లో నిరసన

లక్ష్మీపురం: గతంలో ఢిల్లీ రైతాంగ పోరాట ఫలితంగా మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు పరిచిన కేంద్ర ప్రభుత్వం వాటినే దొడ్డిదారిన వివిధ పేర్లతో తీసుకురావడం దుర్మార్గమైన ఆలోచన అని రైతు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి కొల్లి రంగారెడ్డి, కంచుమాటి అజయ్ ఖండించారు. బ్రాడీపేటలోని కార్యాలయంలో శుక్రవారం అఖిల పక్ష రైతు సంఘాల సమన్య సమితి సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తులను కార్పొరేట్ పరం చేసేందుకు 'నేషనల్ పాలసీ ఫ్రేమ్ వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెటింగ్' పేరుతో పెద్ద కుట్రతో నూతన చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 23న దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనతో పాటు ప్రతులను దగ్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు, కంజుల విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రినిటీ గురు మండలంలో సెమీ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే

నగరంపాలెం: స్థానిక కొత్తపేట కుగ్లర్ ఆసుపత్రి ఆవరణలోని ట్రినిటీ గురు మండలంలో గురువారం రాత్రి క్రిస్మస్ పండుగ ఆరాధన నిర్వహించారు. దివ్యమైన వర్తమానాన్ని బ్రదర్ ఎన్.సోనివుడ్ అందించారు. చిన్నారుల వేషధారణ అలరించింది. క్రిస్మస్ కేక్‌ను ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ కట్ చేశారు. సంఘ కాపరులు రెవ.జె.దైవాశీర్వాదం, రెవ.పి.రమేష్ ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి, నాయకులు, ట్రినిటీ ప్యారిష్ చైర్మన్ బి.గ్రెస్‌భీమరాజు, కోశాధికారి బ్రదర్ బత్తుల లెనిన్, డాక్టర్ అవినాష్ పాల్గొన్నారు.